
# మోడస్ ఆపరాండీ

సమ్మడి రవీంద్రనాథ్




మచిలీపట్నం నుండి వచ్చిన పాసింజరు బస్సు గుడ వాడ బస్టాండులో ఆగగానే అందులోంచి మొదట దిగిన వ్యక్తి సుభద్రమ్మ. నిండుగా వున్న గోనె సంచిని అతి కష్టంమీద బస్‌లోంచి దించిందామె. రిక్షావాడ్ని పిలిచి అందులో కూర్చుని తను వెళ్ళవలసిన స్థలం చెప్పింది. రిక్షా బయల్దేరిన పది నిమిషాలకు అందులోంచి చిన్న పోలిథీన్ సంచి ఒకటి రోడ్‌మీదికి వచ్చి పడింది. అది ఖాళీది కాదు.

రోడ్ మీదున్న వాళ్ళు ఎవరూ దాన్ని గమనించక ముందే కుక్క ఒకటి వచ్చి దాన్ని నోట కరచుకు పోయింది! ఆ రిక్షా మరి కొంత దూరం వెళ్ళాక మరో పోలిథీన్ సంచి క్రింద పడింది. ఆ రిక్షా వెనుకే సైకిల్ మీద వస్తున్న వో యువకుడు దాన్ని చూసి 'అరెరే – రిక్షాలోంచి ఏదో పడిపోయింది' అనుకుంటూ "ఏయ్...రిక్షా.." అని పిలవబోయి ఆ పడిపోయిన వస్తువేమిటో గుర్తించగానే ఊపిరి స్తంభించి పోయి నట్లైంది!! పోలీస్‌స్టేషన్ అక్కడకు దగ్గర్లోనే వుందన్న సంగతి గుర్తొంచిందతనికి వెంటనే!

** ** ** ఇన్‌స్పెక్టర్ మౌర్యను చూస్తుంటే ఏ క్షణంలో గుండె ఆగిపోతుందో నన్నంత భయంగా వుంద సుభద్రమ్మకు. జరిగినదంతా మౌర్యకు వివరిస్తోందామె.

"బందరు బస్టాండ్లో, బస్సు కోసం చూస్తుంటే ఎవరో ఒకతను ఈ గోనె సంచితో వచ్చి నా ప్రక్కన నిల్చున్నాడు. కాసేపయ్యాక 'కొంచెం చూస్తుండమ్మా దీన్ని' అన్చెప్పి ఎటో వెళ్ళి ఎంతకూ రాలేదు. అందులో ఏవో వంట పాత్రలూ, గిన్నెలూ లాంటివి వుండి వుండొచ్చు అనిపించింది నాకు. ఎంతసేపు ఎదుర్చూసినా ఆ మనిషి రాకపోయేసరికి దొంగతనంగా ఆ మూటని నాతో బాటు బస్సులో ఎక్కించేశాను. ఇక్కడికొచ్చి రిక్షాలో వెళ్తూ ఆ సంచిలో ఏముందో చూడాలనిపించి దాని మూతికి కట్టిన తాడు విప్పాను. అంతే.. భయంతో నాకు స్పృహ తప్పింది. రిక్షా కుదుపులకు ఆ సంచిలోవివి జారి రోడ్‌మీదికి పడి పోయినట్లున్నాయి. అంతేనండి జరిగింది. నాకేమీ తెలీదు"

హెడ్ కానిస్టేబుల్ రాము, ఆమె చెప్పేదంతా జాగ్రత్తగా వింటున్నాడు. అతనికిలాంటి వింత కేసులూ, మిస్టీరియస్ కేసులూ, అంటే కుతూహలం ఎక్కువ. ఇంకో కానిస్టేబుల్ సదాశివం మాత్రం సుభద్రమ్మను రాత్రికి లాకప్‌లో వుంచి తనకు 'నైట్ డ్యూటీ' వేస్తే ఎంత బాగుండును అనుకుంటున్నాడు!

మౌర్యకు ఆమె చెప్పినదంతా నిజంలానే అన్పించింది – ఆ క్షణంలో!

ఆ పాలిథీన్ సంచుల్లో నింపిన ఖండ ఖండాలుగా నరికి వేయబడ్డ ఓ మనిషి శరీర భాగాల్ని, ప్రిజర్వేటివ్‌స్ద్వారా పాడవకుండా నిలువ చేసే పనికి ఉపక్రమించారు మౌర్య!

** ** ** బందరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తో, అప్పటివరకూ ఫోన్లో మాట్లాడి రిసీవర్ పెట్టేశాడు ఇన్‌స్పెక్టర్ మౌర్య.

ఓ అరవై ఏళ్ళ వ్యక్తి అప్పుడే స్టేషన్‌లోకి అడుగు పెట్టాడు. ఆ వ్యక్తిని చూడగానే హెడ్ కానిస్టేబుల్ రాము వినమ్రంగా కుర్చీలోంచి లేచి "నమస్తే! మాస్టారూ?" అంటూ చేతులు జోడించాడు.

"బాబూ రామూ! మా వాడు మూడ్రోజుల్నుండీ కనపడడం లేదయ్యా!" చాలా ఆందోళ నపడ్తూ చెప్పాడాయన.

"ఎవరూ రాఘవా?"

"అవునయ్యా. కంప్లైంట్ ఇద్దామని వచ్చాను"

గుడివాడకు మూడు కిలోమీటర్ల దూరంలో వుండే ఓ చిన్న గ్రామంలో ఆయన టీచర్‌గా పని చేస్తున్నారు. పేరు వెంకట్రామయ్య. హెడ్ కానిస్టేబుల్ రాము వాళ్ళది కూడా అదే గ్రామం కావడం వల్ల వాళ్ళిద్దరూ ఒకరికొకరు తెల్సు.

ఇంతలో మౌర్య కలగ జేసుకుని "ఇలా రండి మీరు" అంటూ తన గదికి పిలిపించుకున్నాడు. వెంకట్రామయ్య లోనికి వెళ్ళి వివరాలన్నీ తెలియజేశాడు.

"ఈ మధ్య తీసిన ఫోటో ఏదైనా వుందా మీ అబ్బాయిది?" అడిగాడు మౌర్య.

"తెచ్చాను సార్" చొక్కా జేబులోంచి తీసి ఇచ్చాడు కొడుకు ఫోటోని.

"వాడు మాకు ఒక్కగానొక్క బిడ్డ సార్. మీరే ఎలాగైనా..."

"తప్పకుండానండి. మేం చేయవలసింది అంతా చేస్తాం. మీరు ధైర్యంగా వుండండి"

వెంకట్రామయ్య స్టేషన్ నుండి బయంటికి వెళ్ళగానే హెడ్ కానిస్టేబుల్ రాముని పిలిచాడు మౌర్య

"ఏమయ్యా! వాళ్ళది మీ వూరేనటగా" అనడిగాడు రాము లోపలికి రాగానే.

"అవున్సార్. ఆ కుర్రాడు నాకూ తెల్సు. మంచి కబాడీ ఆటగాడు. చాలా పోటీల్లో ప్రైజులు కూడా గెల్చుకున్నాడు"

"పిక్క్యాడా ఆ ఆటంటే ఇష్టమేగా! కబాడీ పిచ్చిలో పడి ఇంట్లో చెప్పా పెట్టకుండా ఏ ఊర్లోని పోటీలకో వెళ్ళుండడు గదా! ఇదిగో ఈ కంప్లైంట్ ఫైల్ చెయ్"

వెంకట్రామయ్య ఇచ్చిన ఫోటోని మాత్రం తన దగ్గరే వుంచుకున్నాడు మౌర్య!

**   **   **   ఫార్మలిన్ ద్రావణంలో భద్రపరచిన ఆ తల భాగాన్ని నిశితంగా గమనిస్తున్నాడు ఇన్‌స్పెక్టర్ మౌర్య. మెడ వరకూ తెగ్గోసిన ఆ తల తాలూకు ముఖం నుండి ముక్కూ, చెవులూ, పెదాలూ, కళ్ళూ వేరు చేయబడి వున్నాయి. మరే పాలిథీన్ బ్యాగ్‌లోనూ ఆ భాగాలు లేవు. ముఖాన్ని గుర్తు పట్టనీయకుండా చేయాలనే అలా ముఖంలోని ఆ భాగాల్ని చెక్కేశారని తెలుస్తోంది. కళ్ళూ, ముక్కూ, చెవులూ, నోరూ మైనస్ చేయబడ్డ ఆ ముఖాన్ని - వెంకట్రామయ్య కొడుకు ఫోటోతో పోల్చి చూస్తూ పరిశీలిస్తున్నాడు. మచిలీపట్నంలో రిజిస్టరైన, మిస్సింగ్ కేసుల తాలూకు ఫోటోలతో కూడా ఇలానే చేశాడు మౌర్య. కానీ ఏ ఫోటోతోనూ, ఆ ముఖం మ్యాచ్ కావడం లేదు. ఆ ముఖంతో బాటు మిగతా శరీర భాగాల్ని కూడా దగ్గరగా ఎగ్జామిన్ చేస్తున్నప్పుడు అరచేతి వేళ్ళ గోళ్ళల్లో ఇరుక్కున్న రెండు వెంట్రుకలు మౌర్య కంటపడ్డాయి.

ఏదో నోట్‌చేసుకోవడం కోసం జేబులోంచి పెన్ తీశాడు. అది ఇంకు పెన్. చాలా సేపట్నుండీ పాళీ నుండి ఇంకు కారుతున్నట్లుంది. క్యాప్ తీయగానే ఇంకు చుక్కలు చుక్కలుగా కారి తను ఇందాక టేబిల్ మీద పెట్టిన రాఘవ ఫోటో మీద పడ్డాయి. ఫోటోలో ఇప్పుడు ముక్కు కనపడడం లేదు!!

సరిగ్గా అప్పుడు తట్టింది ఫ్లాష్ లాంటి ఓ ఆలోచన.

ప్రిజర్వేటివ్‌లో తేలుతున్న ఆ ముఖంలో ముక్కు ఏ మేరకు, ఏ విధంగా కోయబడిందో ఆ మేరకూ అదే విధంగా ఫోటోలోని ముక్కుమీద ఇంకు పూశాడు. అలాగే కళ్ళమీదా, నోరుమీదా, చెవుల మీద కూడా!

అప్పుడు చూశాడు. ఆ రెండు ముఖాల్నీ మార్చి మార్చి.

ఉద్వేగంతో ఒంట్లోని నెత్తురు ఫౌంటెన్‌లా చిమ్ముతున్న భావన కలిగింది!

ఈసారి స్పష్టంగా తెల్సిపోతోంది - ఆ ఫోటో, ఆ ముఖానికి సంబంధించినదేనని!!

**   **   **   నెల రోజుల తర్వాత ఓ రాత్రి-

పది గంటలప్పుడు.

గదిలో భార్య జడలోని జాజిపూల సువాసనల నాఘ్రాణించడంలో నిమగ్నమై వున్నాడు మౌర్య.

"సహజా! యూ స్మెల్ గుడ్" అన్నాడు తన్మయంగా. భార్య నుండి సరైన ప్రతిస్పందన లేకపోవడంతో అనుమానంగా ఆమె ముఖంలోకి చూశాడు.

"ఏమిటీ? ఏదో ఆలోచనలో వున్నట్టున్నావ్? కొత్త కథేమైనా వ్రాస్తున్నావా?"

పత్రికలకు కథలు వ్రాయడం ఆమెకు హాబీ. కానీ ఈ హాబీతో వచ్చిన చిక్కేమిటంటే ఏదైనా కథ మొదలు పెట్టినప్పుడు దాన్ని పూర్తి చేసేవరకూ, ఏ పనిమీదా మనసు పూర్తిగా లగ్నం చేయలేరామె! అంతగా ఇన్వాల్వ్ అయి పోతుంది.

"అవునండీ! ఈ మధ్య మీరు చెప్పారే గోనెసంచిలోంచి మనిషి శరీర భాగాలు ఒక్కొక్కటిగా రోడ్‌మీద పడ్డ కేసు గురించి . ఆ సంఘటన ఆధారంగా ఓ కథనల్లుతున్నాను. ఆ కేస్ తాలూకు వివరాలు కావాలి నాకు. పరిశోధన అయిపోయిందా? కల్‌ప్రిట్ దొరికాడా?"

మాంచి రొమాంటిక్ మూడ్‌లో వున్న మౌర్యకు భార్య వేసిన ప్రశ్నలు కోన్ అయిస్ క్రీమ్ తింటుండగా మధ్యలో కరివేపాకు తగిలినట్లుగా ఫీలయ్యాడు. అయినా ఆమెకు ఓపిగ్గా జవాబు చెప్పాలనే నిర్ణయించుకున్నాడు. ఎందుకంటే ఆ తర్వాతి కార్యక్రమంలో ఆమె సహాయ నిరాకరణోద్యమం మొదలు పెడ్తే తట్టుకునేలా లేదతన్లోని ఆవేశం!!

"ఆ కేస్‌లో ఇన్వెస్టిగేషన్ పూర్తయి పోయింది. నేరస్థుడు దొరికాడు. అలా ముక్కలు ముక్కలుగా నరకబడ్డ శరీరం తాలూకు మనిషి పేరు రాఘవ. ఇక్కడికి చాలా దగ్గర్లో వున్న ఓ చిన్న గ్రామంలో టీచర్‌గా పని చేస్తున్న వెంకట్రామయ్య అనే ఆయన ఒక్కగానొక్క కొడుకు అతను. ఆ గ్రామం వెళ్ళి ఇన్‌క్వయిరీ మొదలు పెట్టినప్పుడు హత్యాకాండను కళ్ళారా చూసిన పద్దెనిమిదేళ్ళ ఓ ఆడపిల్ల తను చూసిన దాన్ని చూసినట్లు పూసగుచ్చినట్లు చెప్పింది నాకు. ఆ అమ్మాయి అలా ధైర్యంగా ముందుకొచ్చి నిజాన్ని చెప్పకుండుంటే హంతకుడ్ని పట్టుకొనే అవకాశం లేకపోయుండేదేమో.

రాఘవా, ఆ అమ్మాయీ ప్రేమికులు. వీలు చిక్కినప్పుడల్లా, చీకటి వేళల్లో వాళ్ళిద్దరూ, వూరికి కాస్త దూరంగా పంట చేల మధ్య కాలవ గట్టున వున్న ఓ వేప చెట్టు కొమ్మల్లో కలుసుకునేవాళ్ళు. కొమ్మల్లో కలుసుకోవడమంటే నిజంగానే కొమ్మల మీద కూర్చుని కబుర్లు చెప్పకునేవారు. ఆ చెట్టుకొమ్మలు భూమికి కాస్త ఎత్తులోనే వున్నా ఎవరైనా సులభంగా ఎక్కేలా అనువుగా వుండేవి.

ఆ అమ్మాయి పేరు ప్రసూన. హత్య జరిగిన రోజుకూడా వేప చెట్టు గుబురు కలయికకు రాఘవ, ప్రసూనలు ప్లాన్ వేసుకున్నారు. మసక చీకటి ముసిరే వేళ ముందు ఆ అమ్మాయి ఆ స్థలం చేరుకుంది. అలవాటై వుండడంతో ఇబ్బంది లేకుండానే చెట్టు ఎక్కి ఓ కొమ్మ మీద కూర్చుని రాఘవ కోసం ఎదురు చూస్తోంది. ఇంట్లో ఏదో అబద్ధం చెప్పి ఊరి జనం కన్ను కప్పి ఎలా రాగలిగిందామె. ప్రేమలో పడితే అబద్దాలు చెప్పే కళ చాలా చక్కగా అబ్బుతుందేమో ఆడపిల్లకి! చీకటి ముదురుతున్నా రాఘవ రాకపోవడం ఆమెకు భయాన్ని కలుగ చేస్తోంది.

సరిగ్గా అప్పడే ఊరుదాటి చెరకు తోట గట్టు వెంబడి వేగంగా అడుగులు వేస్తున్నాడు రాఘవ. చాలా ఆలస్యమై పోయింది. ప్రసూన అక్కడ వుందో చూసి చూసి వెళ్ళిపోయిందో ఏమోనని దాదాపు పరిగెత్తుతున్నట్లుగా నడుస్తున్నాడతడు. వేప చెట్టుకు సమీపంలోకి రాగానే పొట్టలో ఏదో గుచ్చుకున్నట్లయింది! మనిషి ఎత్తులో ఏపుగా పెరిగిన ఆ చెరకు చేలో రాఘవ




## స్నేహితులారా నేనిక్కడ, మీరెక్కడ?

*1985లో దిగిన ఈ ఫోటోలో ఎడమ నుంచి మొదటిదాన్ని.*

నా ఫ్రెండ్స్ ములగాల సూర్యుడు, బుల్లిపాప.

- ఎస్. సుజాతా కుమారి, బువ్వనపల్లి

కోసం కాపుకాసిన హంతకుడు క్షణమాలస్యం చేయకుండా రాఘవ గుండెల్లో మరోసారి కత్తి దించేశాడు. 'ప్ర..సూన. వీ.." అన్న కేక రాఘవ గొంతు దాటి వెలువడక ముందే ప్రాణం పోయింది.

రాఘవ శరీరాన్ని భుజాన వేసుకుని మోసి వేప చెట్టు క్రిందకు తీసుకు వచ్చాడు. కత్తితో ఆ శరీరాన్ని ముక్కలుగా చేసి పాలిథీన్ బ్యాగుల్లో వేసి ఆ పాలిథీన్ బ్యాగులన్నిటినీ పాలిథీన్ లైనింగ్ వేసిన ఓ పెద్ద గోనె సంచిలో వేసి మూట కట్టేశాడు. క్రింద పడ్డ రక్తాన్ని మట్టిలో కలిపేశాడు. చాలా ప్రొఫెషనల్‌గా, అంతకు ముందు ఎన్నోసార్లు మనసులోనే రిహార్సిల్స్ వేసుకున్నవాడిలా చాలా వేగంగా నిమిషాల్లో ముగించేశాడదంతా!

ఆ తర్వాత తన ఇంట్లోనే ఆ రాత్రంతా ఆ మూటను వుంచి తెల్లవారు ఝామున లేచి మచిలీపట్నం తీసుకు వెళ్ళి అక్కడ బస్టాండ్లో సుభద్రమ్మకు ఆ మూటని చూస్తుండమని చెప్పి వెంటనే గుడివాడ చేరుకున్నాడు. ఇక్కడ కూడా హంతకుడు చాలా జాగ్రత్త పడ్డాడు. మచిలీపట్నం వెళ్ళేప్పుడు విగ్గూ, పెద్ద మీసాలూ పెట్టుకుని పంచె కట్టుకుని మేకప్‌మార్చి వెళ్ళాడు.

రాఘవ చేతి గోర్లో చిక్కుకుని వున్న వెంట్రుకలూ, హంతకుడి వెంట్రుకలూ ఒక్కటే అన్న విషయం లాబ్ ఎనాలిసిస్‌లో రూఢీ అయింది. హంతకుడ్ని బంధించాం"

అక్కడ ఆపాడు మౌర్య.

"అబ్బ... నేను కథలో వ్రాసేదానికంటే సస్పెన్స్‌తో చెప్తున్నారు మీరు - హంతకుడు ఎవరో ఎక్కడా బయట పడకుండా! చూడబోతే నాకంటే మీరే బాగా వ్రాసేట్టున్నారు" అంది సహజ భర్తతో.

"ఎంతైనా రచయిత్రి మొగుడ్ని కదా!"

"సర్లెండి. హంతకుడెవరో చెప్పండి ముందు"

"అదా - రేపు! ఇప్పటికి సశేషం.." అన్నాడు టీజింగ్‌గా చూస్తూ.

చిన్న పిల్లలా బుంగ మూతిపెట్టి గారాంగా ఏడుస్తూ, గుప్పెళ్ళతో భర్త వీపు మీద గుద్దుతూ "ఇప్పుడే చెప్పాలి ప్లీజ్! లేకపోతే నాకు నిద్ర రాదు" అంది.

"చెప్తాలే. మరి నాకేమిస్తావ్?"

"మీరేదడిగినా! నా దగ్గరుంటే"

"సరే అయితే! ఇట్రా.." అంటూ తనక్కావలసిందేమిటో ఆమె చెవిలో చెప్పాడు. అతడు చెప్పేది వింటుంటే ఆమె బుగ్గలు ఎర్రగా అయిపోయాయి. సిగ్గుతో ముఖం కందిపోయింది!

"ఛీ..ఛీ..! అసహ్యం" అంది.

"అసహ్యం ఏముంది?" వైవిధ్యం అనాలి దాన్ని మాటిచ్చావ్ మరి?"

అతికష్టం మీద "సరేలే చూద్దాం.. ముందు చెప్పండి" అంది.

మౌర్య కొనసాగించాడు.

"నిజానికి హత్య వెనుక వున్న మోటివ్ చాలా స్వల్పమైనది. వాళ్ళ గ్రామంలో జరిగిన కబాడీ పోటీల సమయంలో ప్రత్యర్థి జట్టుకు సారథ్యం వహిస్తున్న వ్యక్తికీ, రాఘవకీ మధ్య జరిగిన ఆటకు సంబంధించిన చిన్న తగాదా! ఆటలో రాఘవ ఆధిక్యత పట్ల రేగిన అసూయ!! తను మోజు పెంచుకున్న ప్రసూన, రాఘవ పట్ల మొగ్గు చూపడం అన్నది కూడా ఆ అసూయకు జత కలిసింది! వీటన్నిటినీ మించి తెల్లార్లేచిందగ్గర్నుండీ అనేక రకాల నేరాల గురించిన పరిశోధనలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి వుండే ఉద్యోగంలో వుండడం వల్ల - నేరానికి సంబంధించిన ఏ ఆధారాన్నీ పోలీసులకు మిగల్చకుండా తప్పించుకోవడం పెద్ద కష్టమేమీ కాదనిపించి అలా తప్పించుకోవడంలో వుండే థ్రిల్‌ను పొందాలనే ఓ వింత కోరిక కలిగి వుండడం!! ఇవీ కారణాలు" అక్కడో క్షణం ఆగి మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు మౌర్య.

"ఏంటయ్యా! దివి నుండి భువికి దిగి వచ్చినా అమృతవర్షిని అశ్వినీల్లాంటివేమైనా వాడుతున్నావా! నీ జుట్టు ఇంత నల్లగా నిగనిగలాడ్తోంది. అరే. ఇక్కడో తెల్ల వెంట్రుకుందే అంటూ దాన్ని పీకేస్తున్న వాడిలా చటుక్కున రెండు వెంట్రుకల్ని లాగేసుకున్నప్పుడు నా ప్రవర్తన ఆడ్‌గానే అనిపించినా అనుమానం మాత్రం వచ్చినట్టు లేదు మా హెడ్ రాముకి!!!

హమ్మయ్య. నీ సస్పెన్స్ విడిపోయిందిగా. ఇంక నాకు బహుమతి ప్రదానోత్సవం మొదలు పెట్టు" అంటూ భార్యను కౌగిలించుకుని ఆ బహుమతి ప్రదానోత్సవం తాలూకూ మోడస్ ఆపరెండీని భార్య చెవిలో వివరించసాగాడు మౌర్య!! ●

# త్రికాల్

## ఎం.డి. సౌజన్య

ఎక్స్ట్రా - టెర్రెస్ట్రియల్ సీరియల్

మరి రెండు వారాల్లో ప్రారంభం!

'త్రికాల్'కు అనుబంధంగా మా పాఠకుల వ్యక్తిగత సమస్యలు, సందేహాలకు ఒక ప్రముఖ జ్యోతిష వేత్త సమాధానాలు ఇస్తారు.

- మీ ప్రేమ సఫలమయ్యేందుకు మీరు చెయ్యవలసిందేమిటి?
- ఏ కారణమూ లేకుండానే మీ అమ్మాయికి కళ్యాణ ఘడియ ఎప్పటికప్పుడు వెనకకు పోతోందా?
- మీకు సంతానం కలుగుతుందా లేదా?
- కోరుకున్న ప్రాంతానికి బదిలీని నిబంధనల పేరుతో పై అధికారి అడ్డగిస్తున్నారా?
- చంటాడికి అస్తమానం సుస్తీ చేస్తోందా?
- ఉద్యోగ పర్వంలో మీ ముందువున్న ఆఫర్‌ను అంగీకరించాలా వద్దా?

సవాలక్ష యక్ష ప్రశ్నలు మిమ్మల్ని బాధిస్తూ ఉండవచ్చు. వర్తమానానికీ, రాబోయే కాలానికీ మధ్య లంగరు అందని సమస్యలతో మీరు సతమత మవుతూండవచ్చు. తర్కం నిర్దిష్టంగా సమాధానం ఇవ్వలేని ఎన్నో సందేహాలకు జ్యోతిష శాస్త్రం పరిష్కారాలను సూచిస్తుంది. ఇందుకు కావలసినవల్లా—మీ పూర్తిపేరు; పుట్టిన తేదీ; సమయం; ఊరు; జన్మ నక్షత్రం; మీ హస్త రేఖల నకలు; ఈ క్రింది కూపన్‌ను నింపుతూ మీ ప్రశ్నను సూటిగా, స్పష్టంగా, క్లుప్తంగా వ్రాసి పంపండి. చీకటిలో దాగిన భవిష్యత్తుపై జ్యోతిష కిరణాలు ప్రసరింపజేసి అనువైన నిర్ణయాలు తీసుకోండి.

కూపన్

ప్రశ్న: ------------------------------

మీ పూర్తి పేరు: ------------------------------

ఊరు ------------------------------

పుట్టిన తేదీ: ---------------- సమయం: ----------------

స్థలం: ---------------- జన్మ నక్షత్రం: ----------------

మీ హస్తరేఖల నకలు: ------------------------------

గమనిక: ఒక కూపన్‌తో ఒకటే ప్రశ్న